
ఆంధ్రజ్యోతి
andhrajyothy.com శుక్రవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 32.0 : కనిష్ఠం 15.6
ఆదిలాబాద్ జిల్లా వార్తలు
5
శనివారం 13 జనవరి 2024






● జిల్లాకేంద్రంలోని అంబేద్కర్‌చౌక్ సమీపంలో రోడ్డుకు ఇరువైపులా నిలిపి ఉంచిన వాహనాలు



● ట్రాఫిక్ సమస్యలపై అధికారులకు సలహాలు, సూచనలు చేస్తున్న ఎమ్మెల్యే (ఫైల్)



అడ్డదిడ్డంగా.. ట్రాఫిక్

- జిల్లాకేంద్రంలో ట్రాఫిక్ సమస్యలతో వాహనదారులకు తప్పని తిప్పలు
- ఎక్కడా కనిపించని ట్రాఫిక్ రూల్స్
- వ్యాపారుల ఇష్టారాజ్యం.. స్థానిక వాహనదారుల అవస్థలు
- అభివృద్ధి పేరిట డివైడర్‌ల నిర్మాణ పనులు.. రెండింతలవుతున్న ఇబ్బందులు
- చర్యలు చేపట్టని సంబంధిత శాఖ అధికారులు
- ఎమ్మెల్యే ఆదేశాలు సైతం బేఖాతర్!!
- ప్రమాదాల బారిన పడుతున్నా.. పట్టింపు కరువాయే..
- ప్రత్యేక ప్రణాళికలను రూపొందించి ప్రమాదాలకు అడ్డుకట్ట వేయాలని కోరుతున్న ప్రజలు

ఆదిలాబాద్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ పట్టణంలో ట్రాఫిక్ అడ్డదిడ్డంగా మారడంతో వాహనదారులకు అవస్థలు తప్పడం లేదు. ఇళ్లు దాటి రోడ్డెక్కితే చాలు.. ట్రాఫిక్ ఇబ్బందులతో సతమతమవుతున్నారు. దీంతో జిల్లా కేంద్రంలో నిత్యం ఎక్కడో ఓ చోట.. ఏదో ఒక ప్రమాదం జరగడం పరిపాటిగా మారింది. పట్టణాభివృద్ధి పేరిట రోడ్డు మధ్యలో డివైడర్ నిర్మించడంతో ట్రాఫిక్ ఇబ్బందులు రెండింతలవుతున్నాయి. అయినా ట్రాఫిక్ పోలీసులు ప్రత్యామ్నాయ చర్యలను చేపట్టడం లేదు. ఇటీవల ట్రాఫిక్ సమస్యలపై దృష్టి సారించిన ఎమ్మెల్యే పాయల శంకర్ ట్రాఫిక్ పోలీసు, మున్సిపల్ అధికారులతో క్షేత్ర స్థాయిలో పర్యవేక్షణ చేశారు. డివైడర్ల నిర్మాణంలో జరిగిన లోటుపాట్లు చిరు వ్యాపారులకు ప్రత్యామ్నాయ మార్గాలను చూపాలని ఆదేశించారు. అయినా అడుగు ముందుకు పడినట్లు కనిపించడం లేదు. ముఖ్యంగా కలెక్టర్‌చౌక్, రిమ్స్ ఆసుపత్రి, దస్నాపూర్ పెట్రోల్ బంక్, గర్ల్ హైస్కూల్ క్రాస్‌రోడ్డు, పంజాబ్ చౌక్, అంబేద్కర్ చౌక్, వినాయక్ చౌక్, నేతాజీ చౌక్‌లలో పరిస్థితి మరీ అధ్వానంగా మారింది. రోడ్డు దాటాలంటే ప్రయాణికులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని వెళ్తున్నారు. పండుగలు, ఉత్సవాల సందర్భాలలో ట్రాఫిక్ ఇబ్బందులతో పట్టణ ప్రజలు మరింత ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఈ రూట్లలో ప్రయాణం చేసేందుకు వాహనదారులు జంకుతున్నారు. ప్రధాన రూట్లతో పాటు కూడళ్ల వద్ద ట్రాఫిక్ రూల్స్‌ను గాలికొదిలేయడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. పట్టణంలో ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు ప్రత్యేక ప్రణాళికలను రూపొందించి ప్రమాదాలకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు.

నియంత్రణ చర్యలు కరువు

కొందరు వ్యాపారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ రోడ్డుపైనే వ్యాపారం చేసుకోవడంతో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. ముఖ్యంగా పట్టణంలోని ఎన్టీఆర్ చౌక్, కలెక్టర్ చౌక్, వినాయక్ చౌక్, అంబేద్కర్ చౌక్, గాంధీ చౌక్, శివాజీ చౌక్, ఠాకూర్ హోటల్ ఏరియాలో చిరు వ్యాపారులతో పాటు బడా వ్యాపారులు ఇష్టారాజ్యంగా వాహనాలను పార్కింగ్ చేయడంతో కాలు తీసి కాలు వేసే పరిస్థితి కనిపించడం లేదు. ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా పట్టణంలోని పలు ప్రధాన వీధుల్లో డివైడర్‌లను, సెంట్రల్ లైటింగ్‌ను ఏర్పాటు చేసినా.. అవే ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రోడ్డుకు ఇరువైపుల వాహనాలను అడ్డదిడ్డంగా నిలపడంతో వన్‌వేలో కూడా ద్విచక్ర వాహనాలు వెళ్లడం కష్టంగా మారింది. ముఖ్యంగా నేతాజీ చౌక్ నుంచి వినాయక్ చౌక్, రైల్వేస్టేషన్ వరకు కొన్ని వ్యాపారాలు సెల్లర్లలోనే కొనసాగడంతో ట్రాఫిక్ సమస్యలు తీవ్రమవుతున్నాయి. పలు షాపింగ్ కాంప్లెక్స్‌ల ముందు రోడ్డు పైనే పార్కింగ్ చేస్తూ షాపింగ్ చేయడంతో గంటల తరబడి ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతున్నా.. అటువైపు ట్రాఫిక్ పోలీసులు కన్నెత్తి చూడడం లేదంటున్నారు. అంతేకాకుండా పట్టణంలో ప్రధాన రహదారుల్లో పశువుల సంచారం కూడా పెరిగిపోతున్నా.. సంబంధిత మున్సిపల్ అధికారులు నియంత్రించేందుకు చర్యలు చేపట్టడం లేదు. మున్సిపల్, పోలీసు శాఖల మధ్య సమన్వయం లేకపోవడంతో ట్రాఫిక్ సమస్య పరిష్కారం కావడం లేదన్న అభిప్రాయాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.

కనిపించని మార్పు

పట్టణంలోని ట్రాఫిక్ సమస్యలపై ఎమ్మెల్యే పాయల శంకర్ ప్రత్యేక దృష్టిని సారించి పరిష్కారం చూపాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించినా.. మార్పు కనిపించడం లేదు. గతంలో చేపట్టిన అభివృద్ధి పనులతో ట్రాఫిక్‌కు మరింత అంతరాయం ఏర్పడుతోందని, వెంటనే లోపాలను సరిదిద్దాలని సూచించారు. అయినా అధికారులు ట్రాఫిక్ ఇబ్బందులకు అడ్డుకట్ట వేసేందుకు ప్రయత్నాలు మొదలు పెట్టడం లేదు. ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలను గుర్తించి హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాల్సి ఉన్నపట్టికీ.. ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదన్న వాదనలు వినిపిస్తున్నాయి. పది రోజులు గడుస్తున్నా.. ట్రాఫిక్ ఇబ్బందులకు పరిష్కారం చూపేందుకు అధికారులు దృష్టి సారించడం లేదు. దీంతో ప్రమాదాలు జరిగి నిండు ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయి. ట్రాఫిక్ రూల్స్‌పై వాహనదారుల్లో అవగాహన కల్పించకుండా ఎన్ని నిబంధనలు విధించినా.. ప్రయోజనం ఉండదనే అభిప్రాయాలు కూడా వినిపిస్తున్నాయి. కేవలం ట్రాఫిక్ చలాన్ల పైనే దృష్టి సారిస్తున్న పోలీసులు.. ఇబ్బందులను తొలగించేందుకు చర్యలు చేపట్టడం లేదన్న ఆరోపణలు వస్తున్నాయి. అంతేకాకుండా ప్రధాన కూడళ్ల వద్ద మాత్రమే నిఘా కనిపిస్తున్నా.. పట్టణంలోని మార్కెట్‌తో పాటు రద్దీ ప్రాంతాలలో ట్రాఫిక్ పోలీసులు కనిపించడం లేదు. జిల్లాకేంద్రంలో అడుగడుగునా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినా.. రోజుల తరబడి పరిశీలన, పర్యవేక్షణ కరువవుతోంది. కొన్నిచోట్ల సీసీ కెమెరాలు పని చేయడమే లేదని తెలుస్తుంది. పని చేసిన చోట ట్రాఫిక్‌ను పరిశీలించి కట్టడి చర్యలు చేపట్టే ప్రయత్నం కూడా చేయడం లేదన్న విమర్శలు వస్తున్నాయి.

నిబంధనలు గాలికి..

గతంలో ప్రమాదాల నివారణకు జిల్లా పోలీసులు నో హెల్మెట్.. నో పెట్రోల్ అనే నిబంధనను కఠినంగా అమలు చేశారు. దీంతో కొంత వరకు ప్రమాదాల నుంచి ప్రాణాలను కాపాడగలిగారు. ప్రస్తుతం నో హెల్మెట్.. నో పెట్రోల్ ఎక్కడా అమలుకు నోచుకోవడం లేదు. అప్పట్లో వివిధ రకాలుగా హెల్మెట్‌పై పోలీసులు అవగాహన కూడా కల్పించారు. దీంతో హెల్మెట్ ఉంటేనే పెట్రోల్ బంకుల్లో సిబ్బంది పెట్రోల్ పోసేందుకు ముందుకు వచ్చారు. కానీ ఇది మున్నాళ్ల ముచ్చటగానే మారింది. ప్రస్తుతం అన్ని పెట్రోల్‌బంకుల్లో వాల్ పోస్టర్లు కనిపిస్తున్నా.. నో హెల్మెట్.. నో పెట్రోల్ అనే నిబంధనను ఎవరూ పాటించడం లేదు. పోలీసులు కూడా దీనిని తేలికగానే తీసుకోవడంతో వాహనదారులు హెల్మెట్‌ను ధరించేందుకు ఆసక్తిని చూపడం లేదు. దీంతో ప్రమాదాలు జరిగిన సమయంలో నిండు ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయి. ట్రాఫిక్ రూల్స్‌పై వాహనదారుల్లో అవగాహన కల్పించకుండా ఎన్ని నిబంధనలు విధించినా.. ప్రయోజనం ఉండదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇకనైనా ట్రాఫిక్ నిబంధనలను కఠినంగా అమలు చేస్తూ వాహనదారుల్లో మరింత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్న వాదనలు వినిపిస్తున్నాయి.



మున్సిపల్ అధికారులు నిర్ణయం తీసుకోవాల్సి ఉంది

: ప్రణయ్‌కుమార్ (ట్రాఫిక్ సీఐ, ఆదిలాబాద్)

జిల్లాకేంద్రంలో ట్రాఫిక్ ఇబ్బందులపై ఇప్పటికే ఎమ్మెల్యేతో కలిసి క్షేత్రస్థాయి పరిశీలన చేయడం జరిగింది. దీనిపై మున్సిపల్ అధికారులు నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. రోడ్డుకు ఇరువైపుల ఏర్పాటు చేసిన వ్యాపార సముదాయాలు, పార్కింగ్ స్థలాలను గుర్తించి చర్యలు తీసుకుంటాం. త్వరలోనే మున్సిపల్ అధికారులతో కలిసి ట్రాఫిక్ ఇబ్బందులను తొలగిస్తాం.

సంక్షిప్త సమాచారం



పాత ఉట్నూర్‌లో సమస్యలను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే బొజ్జు

'సమస్యల పరిష్కారానికి కృషి'

ఉట్నూర్, జనవరి 12: తమ దృష్టికి వచ్చిన సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తానని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ అన్నారు. శుక్రవారం ఉదయం మార్నింగ్‌లో భాగంగా మండలకేంద్రంలోని పాత ఉట్నూర్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా సబ్‌స్టేషన్ నుంచి బాటలింగ్ వరకు వేసిన హై వోల్టేజ్ కరెంట్ లైన్లు తమ ఇళ్లపై నుంచి వెళ్తుండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని గ్రామస్థులు వివరించారు. దీంతో ఎమ్మెల్యే వెంటనే ట్రాన్స్‌. డీఈకి ఫోన్ చేసి ఈ హై టెన్షన్ లైన్లను మార్చాలని ఆదేశించారు. తమ కాలనీలో ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు మంచినీటి ట్యాంకు నిర్మించినప్పటికి నల్ల నీరు ఆరవడం లేదని, కాలనీలో సిమెంట్ రోడ్లు వేయాలని కోరారు. ఇందులో మెస్రం శేషనారాయణ, మడావి లక్ష్మణ్, ఆత్రం నారాయణ, మెస్రం నాగోరావు, తదితరులున్నారు.

సొసైటీ కార్యాలయం తనిఖీ

తలమడుగు, జనవరి 12: మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ కార్యాలయాన్ని శుక్రవారం మండల వ్యవసాయ అధికారి మహేందర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రైతులకు విక్రయించిన ఎరువుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ యాసంగిలో తలమడుగు వ్యవసాయ సహకార సంఘం ద్వారా దాదాపు రూ. నాలుగు కోట్ల విలువ గల ఎరువులను విక్రయించడం జరిగిందన్నారు. దీంతో రైతులకు ఆర్థిక భారం తగ్గించడమే కాకుండా సమయానికి రైతులు పంటలకు అందించే వీలు కలిగిందన్నారు. రబీలోనూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా విత్తనాలు ఎరువులు అందించాలని సూచించారు. ఎరువులను విక్రయించేటప్పుడు తప్పనిసరిగా ఆధార్ నెంబర్ నమోదు చేయాలన్నారు. మండలంలోని సుంకిడి కజ్జర్ల, బరంపూర్, కుచ్లాపూర్, తదితర సెంటర్‌లోను ఎరువుల విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేశామని సీవో శ్రీనివాస్ తెలిపారు. అనంతరం సహకార బ్యాంక్ మేనేజర్ రవియాదవ్ మాట్లాడుతూ బ్యాంకు ద్వారా తీసుకున్న రుణాలను రైతులు సకాలంలో చెల్లించాలని కోరారు. ఇందులో సీఈవో మోతే శ్రీనివాస్, ఫీల్డ్ ఆఫీసర్ మదర్, సెక్రటరీలు సాగర్, గంగయ్య, భీమ్‌రావు, సిబ్బంది సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

'విద్యుత్ సౌకర్యం కల్పించాలి'

తలమడుగు, జనవరి12: మండలంలోని మారుమూల గిరిజన గ్రామాల రైతులకు విద్యుత్ సౌకర్యం కల్పించాలని శుక్రవారం ఉట్నూర్ ఐటీడీఏ పీఓ చాహత్‌బాజ్‌పాయిని కలిసి ఆదివాసీ గిరిజన రైతులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి మాట్లాడుతూ మండలంలో గతేడు 60 మంది ఎస్టీ రైతులకు ట్రైబల్ ఎస్‌డీఎఫ్ నిధుల నుంచి విద్యుత్ కనెక్షన్‌లు ఇవ్వడం జరిగింది. మిగిలిన 20మంది కోసాయి, ఉమ్రి, గ్రామ ఎస్టీ రైతులకు విద్యుత్ కనెక్షన్‌లు మంజూరు చేయాలని కోరారు. ఇందులో ఎంపీటీసీ మెస్రం హనుమంతు, దత్తు పటేల్, పోశెట్టి, తదితరులు పాల్గొన్నారు.

పత్తి కొనుగోళ్లకు అంతరాయం

● లారీ డ్రైవర్ల నిరసనతో ఆదిలాబాద్ మార్కెట్ యార్డులో నిలిచిపోయిన కొనుగోళ్లు ● రైతుల ఆందోళన.. తిరిగి కొనుగోళ్లు ప్రారంభం

ఆదిలాబాద్ అర్బన్, జనవరి 12: ఆదిలాబాద్ మార్కెట్ యార్డులో పత్తి కొనుగోళ్లకు అంతరాయం ఏర్పడింది. శుక్రవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు అధికారులు కొనుగోళ్లను నిలిపి వేయడంతో పత్తిని మార్కెట్‌కు తీసుకొచ్చిన బండ్లతో భారీ రద్దీ ఏర్పడింది. లారీ డ్రైవర్ల నిరసన కారణంగా మార్కెట్‌యార్డులో పత్తి నిల్వలు భారీగా పెరిగి పోవడంతో కొత్తగా మార్కెట్‌కు వచ్చిన పంట దిగుబడులను కొనుగోలు చేయకుండా అధికారులు నిలిపి వేశారు. దీంతో ఆగ్రహం వ్యక్తం చేసిన రైతులు నిరసన చేపట్టారు. వెంటనే పత్తిని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. దీంతో విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పాయల శంకర్ జిల్లా అదనపు కలెక్టర్ శ్యామలదేవి, డీఎస్పీ ఉమేందర్ మార్కెట్‌యార్డుకు చేరుకుని లారీ ఓనర్స్, వ్యాపారులతో సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. అనంతరం మధ్యాహ్నం తర్వాత పత్తి కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పత్తి రైతులను ఆదుకునేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటామన్నారు. కేంద్ర ప్రభుత్వ కొనుగోలు సంస్థ సీసీఐ ద్వారా పత్తిని కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. చిన్నపాటి ఇబ్బందులతో కొనుగోళ్లు నిలిచి పోయాయన్నారు. రైతులను ఎవరు ఇబ్బంది పెట్టిన సహించేది లేదన్నారు. సీసీఐ కొనుగోలు చేసిన పత్తిని నిల్వ చేయడంతోనే ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. జిల్లా అధికారులు ఎప్పటికప్పుడు కొనుగోళ్లను పరిశీలిస్తూ ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకుంటామన్నారు.



కొనుగోళ్లు నిలిచిపోవడంతో బారులు తీరిన పత్తి బండ్లు



అధికారులు, వ్యాపారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే, అధికారులు



లారీ అసోసియేషన్ సభ్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

ఐఎస్ఎల్ ఏర్పాట్లను త్వరగా పూర్తి చేయండి : పీవో

ఉట్నూర్, జనవరి 12: ఈనెల 15 నుంచి 20 వరకు జరుగనున్న ఇంటర్ సొసైటీ లీగ్ పోటీలకు ఏర్పాట్లు త్వరగా పూర్తి చేయాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి చాహత్‌బాజ్‌పాయి అధికారులను ఆదేశించారు. శుక్రవారం మండల కేంద్రంలోని కొమురంభీం ప్రాంగణంలో జరుగుతున్న ఐఎస్ఎల్ ఏర్పాట్లను ఆమె పరిశీలించారు. క్రీడా మైదానాలతో పాటు పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేయాలన్నారు. పూలాజీబాబా పాఠశాల మైదానాన్ని పార్కింగ్ స్థలం కోసం వినియోగించాలని పేర్కొన్నారు. భోజనాల కోసం ఏర్పాటు చేసిన గిరిజన బాలికల గురుకుల కళాశాల మైదానాన్ని పరిశీలించారు. పది కౌంటర్లు ఏర్పాటు చేస్తామని తెలిపారు. భోజనాల వద్ద జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

● క్రీడా శిబిరాల పరిశీలన

ఐఎస్ఎల్ పోటీల కోసం ఎంపికైన క్రీడాకారులకు ఇస్తున్న శిక్షణ కార్యక్రమాల శిబిరాన్ని పీవో పరిశీలించారు. క్రీడాకారులకు అందుతున్న సౌకర్యాలు అడిగి తెలుసుకున్నారు. ఇంకా మూడు రోజుల్లో పోటీలు ప్రారంభంకానున్నందున స్టార్ సొసైటీ విద్యార్థులు అన్నిరంగాల్లో ముందుండాలన్నారు. విద్యార్థులకు సత్వర వైద్య సేవలు అందించేలా చూడాలన్నారు. ఈ సందర్భంగా ఖేల్ ఇండియా జాతీయ స్థాయి ఖోఖో పోటీలలో పాల్గొనేందుకు ఎంపికైన ఆదర్శ గ్రేట్ పాఠశాల విద్యార్థి మెస్రం అంజన్నను సన్మానించారు. కేల్ ఇండియా పోటీలకు ఎంపిక కావడం అభినందనీయమన్నారు. ఇందులో డీడీ దిలీప్‌కుమార్, ఆర్‌సీవో గంగాధర్, గిరిజన సంక్షేమ జిల్లా క్రీడల అధికారి కోరెడ్డి పార్థసారథి, పిజికల్ డైరెక్టర్లు హేమంత్‌నాయక్, గోపాల్, లక్ష్మణ్, మీనారెడ్డి, జీవరత్నం, తదితరులున్నారు.



ఐఎస్ఎల్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి



ఎక్సైజ్ సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందిస్తున్న సుహాసినిరెడ్డి

'గ్రామాల్లో బెల్ట్‌షాపులను తొలగించాలి'

ఆదిలాబాద్ అర్బన్, జనవరి 12: జిల్లాలోని పట్టణాలతో పాటు గ్రామాల్లో పట్టణంలో ఇష్టారీతిన నిర్వహిస్తున్న బెల్ట్‌షాపులను వెంటనే తొలగించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు, మాజీ జడ్పీ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి డిమాండ్ చేశారు. జిల్లాకేంద్రంలో శుక్రవారం మహిళలతో కలిసి ఎక్సైజ్ సూపరింటెండెంట్ హేమశ్రీకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజల్ని మద్యానికి బానిసలను చేసి వారి జీవితాలను నాశనం చేసిందన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల కంటే ముందు అధికారంలోకి వస్తే బెల్ట్‌షాపులను పూర్తిగా తొలగిస్తామని హామీ ఇచ్చిందని, అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లో మహిళలకు ఉచిత బస్ సౌకర్యం కల్పించనట్లుగా బెల్ట్‌షాపులను పూర్తిగా తొలగించి ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరారు. ఆమె వెంట నాయకులు సరిత, పలువురు మహిళలున్నారు.



బోథ్‌లో ఆన్‌లైన్ ప్రక్రియను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియను సకాలంలో పూర్తి చేయండి

బోథ్, జనవరి 12: ప్రజా పాలన కార్యక్రమంలో వివిధ గ్రామాల నుంచి వచ్చిన ఆరు గ్యారంటీల దరఖాస్తులను సకలంలో కంప్యూటరీకరించాలని అసిస్టెంట్ కలెక్టర్ ఖుష్బుగుప్త పేర్కొన్నారు. శుక్రవారం బోథ్ ఎంపీడీవో కార్యాలయాన్ని సందరక్షించి ఆన్‌లైన్ జరుగుతున్న విధానాన్ని పరిశీలించారు. సకాలంలో అన్‌లైన్ చేసినట్లయితే అర్హులైన వారికి సంక్షేమ పథకాలు వరిస్తాయని అదనపు కలెక్టర్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఇందులో ఎంపీడీవో సుశీల్‌రెడ్డి, ఎంపీఈవో జీవన్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

● 'కార్యదర్శుల పనితీరే ప్రామాణికం'

బజార్‌హత్నూర్: ప్రభుత్వ ఆదేశాల మేరకు నాలుగేళ్ల పూర్తి చేసుకున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శుల క్రమబద్ధీకరణకు వారి పనితీరే ప్రామాణికమని జిల్లా స్థానిక సంస్థల అడిశనల్ కలెక్టర్ ఖుష్బుగుప్త అన్నారు. శుక్రవారం మండలం పరిధిలోని జాతర్ల, చందునాయక్‌తండా, గిర్జాయి గ్రామ పంచాయతీలలో జూనియర్ పంచాయతీ కార్యదర్శులుగా విధులు నిర్వర్తిస్తున్న ముగ్గురు పంచాయతీ కార్యదర్శులను క్రమబద్ధీకరించారు. వారు గ్రామాలలో చేపడుతున్న పనులకు సంబంధించిన రికార్డుల నిర్వాహణను పరిశీలించారు. అనంతరం ప్రజాపాలనలో భాగంగా తీసుకున్న దరఖాస్తులను వంద శాతం ఆన్‌లైన్ ప్రక్రియలో వివరాలను నమోదు చేయడంతో ఎంపీడీవో రాథోడ్ రాధ, తహసీల్దార్ శంకర్, ఎంపీవో మహేందర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులను ప్రత్యేకంగా అభినందించారు.



మాట్లాడుతున్న అడహక్ కమిటీ సభ్యుడు మాధవ్

హీరా సుక్కా జయంతిని అధికారికంగా నిర్వహించాలి : గేడం మాధవ్

మావల, జనవరి 12: ఆదివాసుల ఆరాధ్యదైవమైన హీరా సుక్కా జయంతి వేడుకలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని ఆదివాసీ పర్ధాన్ సమాజ్ అడహక్ కమిటీ జిల్లా నాయకుడు గేడం మాధవ్ అన్నారు. శుక్రవారం మావల మండలంలోని వాఘాపూర్ గ్రామంలో ఆదివాసీ పర్ధాన్ సమాజ్ సమావేశాన్ని నిర్వహించారు. స్వామివివేకానంద జయంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వామి వివేకానందను ఆదివాసీ యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఆదివాసీ పర్ధాన్ సమాజ్ అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్నారని, ప్రభుత్వాలు తమకు సంక్షేమ పథకాలు మంజూరు చేసి ఆదుకోవాలన్నారు. ప్రభుత్వాలు ఆదుకోవాలంటే విభేదాలను పక్కన పెట్టి ఆదివాసీ పర్ధాన్ సమాజ్ ఐక్యం కావాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే ఐటీడీఏకు నిధులు మంజూరు చేసి ఆదివాసుల ఆర్థికాభివృద్ధికి కృషి చేయాలని కోరారు. రాజకీయంగా, ఆర్థికంగా వెనుకబడి ఉన్న ఆదివాసీ పర్ధాన్ సమాజ్‌ను జాగృతి చేసేందుకు సమాజ్ పెద్దలుగా తమ వంతు కృషి చేస్తున్నామన్నారు. శనివారం ఇంద్రవెల్లిలో జరగనున్న సన్నాహక సమావేశానికి ఆదివాసీ మేధావులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, రాజకీయ పార్టీల నాయకులు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

● మావల మండల కార్యవర్గం ఎన్నిక

మావల మండలం ఆదివాసీ పర్ధాన్ సమాజ్ మండల కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా గోడం వినోద్ కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మడావి కరుణాకర్, గౌరవ అధ్యక్షుడిగా మడావి నారాయణ, మెస్రం ప్రేమ్ నివాస్, ఉపాధ్యక్షుడిగా మడావి రతన్, సలహాదారులుగా మెస్రం ప్రకాష్, మడావి స్వామిదాస్, మెస్రం ప్రభాకర్, సహాయ కార్యదర్శిగా సాయిప్రసాద్, ప్రదాన కార్యదర్శి గా మడావి దత్తు, కోశాధికారిగా మడావి సంతోష్, ప్రచార కార్యదర్శిగా మడావి అరుణ్ కుమార్, కార్యనిర్వాహక సభ్యులుగా మెస్త్రం అనిల్, మడావి సుధాకర్, ఉయిక అవినాష్, కొడప రఘువీర్, మెస్రం కిరణ్, మెస్రం కిషోర్, మెస్రం రోషన్‌లు ఎన్నికైన వారిలో ఉన్నారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులను అభినందించారు. ఈ సమావేశంలో అడహక్ కమిటీ సభ్యులు మడావి దిగంబర్, సెడ్మకి సుభాష్, మడావి గణేష్, గేడం దీపక్, తదితరులు ఉన్నారు.



మృతి చెందిన కుటుంబాలను పరామర్శిస్తున్న జోగు రామన్న

బాధిత కుటుంబాలకు పరామర్శ

ఆదిలాబాద్ అర్బన్, జనవరి 12: మండలంతో పాటు ఆదిలాబాద్ పట్టణానికి చెందిన పలు కుటుంబాలను మాజీ మంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న పరామర్శించారు. కుటుంబ సభ్యులు అధైర్య పడకుండా వారిని కలిసి ధైర్యాన్ని చెప్పారు. కాగా మున్నూరు కాపు సంఘ మాజీ అధ్యక్షుడు పెండల్‌వాడ గ్రామానికి చెందిన ఘగ్యం విఠల్ అల్లుడు కంది జైపాల్ అంత్యక్రియలను స్వగ్రామంలో నిర్వహించగా రామన్న అంత్యక్రియల్లో పాల్గొన్నారు. అలాగే రవీంద్రనగర్‌కు చెందిన రిటైర్డ్ టీచర్ కుమారుడు అఖిల్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో సానుభూతి వ్యక్తం చేస్తూ కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించారు. అంతకు ముందు ప్రముఖ పబ్లిక్ ప్రాసిక్యూటర్ మేకల మధుకర్, సోదరుడు మరణించగా బరంపూర్ గ్రామానికి వెళ్లి వారి కుటుంబాన్ని పరామర్శించా రు. దివ్యాంగుల కాలనికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త బొజ్జ అశోక్ తల్లి కాలం చెందగా.. వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వీరి వెంట మాజీ మార్కెట్ చైర్మన్ మెట్టు ప్రహ్లాద్, మార్కెట్ చైర్మన్ కొమురం రాజు, ఇజ్జగిరి నారాయణ, నవాతే శ్రీనివాస్, కేదరి ఈశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.



గోదాంలను పరిశీలిస్తున్న ఆదిలాబాద్ కలెక్టర్

నూతన ఎఫ్‌సీఐ పాయింట్ ప్రారంభం

ఆదిలాబాద్ అర్బన్, జనవరి 12: స్థానిక సెంట్రల్ వెరహౌజింగ్ కార్పొరేషన్ గోదాంలను ఆదిలాబాద్ కలెక్టర్ రాహుల్‌రాజ్ శుక్రవారం పరిశీలించారు. దీనిలో భాగంగా రైస్ మిల్లర్ల కోసం 8వేల మెట్రిక్ టన్నుల నూతన ఎఫ్‌సీఐ పాయింట్‌ను ప్రారంభించారు. ఇందులో డీఎస్‌వో కిరణ్ కుమార్, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన టీఎన్జీవోస్ నాయకులు

ఆదిలాబాద్ అర్బన్, జనవరి 12: నూతనంగా జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీసుగా బాధ్యతలు స్వీకరించిన గౌస్‌ఆలంను టీఎన్జీవోస్ యూనియన్ ఆధ్వర్యంలో కలిసి పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షులు నందఅశోక్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవోస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎడ్లనవీన్‌కుమార్, తిరుమల్‌రెడ్డి, మురళి, గంగాధర్, దేవేందర్, నాల్గవ తరగతి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొండూరి గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

'బినామీలతో విక్రయాలు జరపవద్దు'

బోథ్, జనవరి 12: చౌక ధరల దుకాణాల నిర్వహించే రేషన్ డీలర్లు బినా మీ వ్యక్తులను పెట్టి విక్రయాలు జరపవద్దని తహసీల్దార్ సుభాష్ చంద్ర పేర్కొన్నారు. శుక్రవారం రేషన్ డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం చౌక ధరల దుకాణాల నిర్వహణపై రేషన్ డీలర్ పనితీరుపై పర్యవేక్షణ చేస్తుందన్నారు. అయితే అందులో భాగంగానే అధికారులు రేషన్ డీలర్ల పనితీరును పర్యవేక్షించాల్సి వస్తుందన్నారు. లబ్ధిదారులకు సకాలంలో బియ్యం అందించాలని ఇందులో అక్రమాలు జరిగితే డీలర్లపై వేటు తప్పదు అన్నారు. ప్రతీ డీలర్ రేషన్ సరుకుల అమ్మకాలపై సమయ పాలన పాటించాలని పేర్కొన్నారు. ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవన్నారు. మండలంలోని మూడు దుకాణాలలో బినామీ వ్యక్తులు విక్రయిస్తున్నట్లు ఫిర్యాదులు వచ్చాయని, బియ్యం కౌంటర్ల వద్ద డీలర్లు తప్పని సరిగా ఉండాలన్నారు. ఇందులో డిప్యూటీ తహసీల్దార్ మల్లేష్ ఆర్ఐ సునీత, సూపరింటెండెంట్ శ్యామ్‌సుందర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

'సరైన పత్రాలు లేకుంటే కేసులు తప్పవు'

బోథ్, జనవరి 12: సరైన ధ్రువీకరణ పత్రాలు లేకుండా వాహనాలు నడిపితే కేసులు తప్పవని ఎస్సై రాము పేర్కొన్నారు. శుక్రవారం మండలం సమీపంలోని కుచలాపూర్ బస్టాండ్ సమీపంలో వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా సరైన ధువకరణ పత్రాలు లేని వాహనాలకు జరిమానాలు వేశారు. ఎట్టి పరిస్థితుల్లో డ్రైవింగ్ లైసెన్స్ ఇన్సూరెన్స్ లేకుండా వాహనదారులు రోడ్డు ఎక్కవద్దని పేర్కొన్నారు.

నిర్లక్ష్యం వీడాలి : మాజీ మంత్రి రామన్న

ఆదిలాబాద్, జనవరి 12(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇస్తానన్న హామీలను అందించడంలో నిర్లక్ష్యం వీడాలని మాజీ మంత్రి జోగు రామన్న డిమాండ్ చేశారు. బేల మండలం జునోని గ్రామంలో ఏర్పాటు చేసిన నూతన కొమురంభీం విగ్రహ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గ్రామస్థులు వారి సాంప్రదాయ వాయిద్యాలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం కొమురంభీం చిత్ర పటం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామస్థులతో కలిసి నూతన కొమురంభీం విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం జోగు రామన్న మాట్లాడుతూ గతంలో కాంగ్రెస్ బీజేపీ ప్రభుత్వాలు కొమురంభీం ఆశ సిద్ధాంతాన్ని పక్కన పెట్టి స్వార్థపూరిత రాజకీయాలు చేశారన్నారు. మాజీ సీఎం కేసీఆర్ నేతృత్వంలో కొమురంభీం ఆశయ సాధనకు ఎంతగానో కృషి చేశారన్నారు. రూ.50కోట్లతో మ్యూజియాన్ని ఏర్పాటు చేసి ఆదవాసీ సంస్కృతి సంప్రదాయాలకు నిలిచి పోయేల నిర్మాణాలను చేపట్టారన్నారు. ఆదివాసీలకు పట్టాలు రైతుబంధు ఇచ్చిన ఏకైక వ్యక్తి సీఎం కేసీఆర్ అని పేర్కొన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రైతులపై చిన్నచూపు చూపకుండా వారికి రావాల్సిన హక్కులను అందించడంలో కృషి చేయాలన్నారు. లేదంటే రైతుల పక్షాన ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ రౌతు మనోహర్, మండల అధ్యక్షుడు ప్రమోద్ రెడ్డి, గంభీర్‌ఠాక్రె, సతీష్‌పవార్, దేవన్న, సునిల్, కుమ్రరాజు, గోదురు భూమన్న, చరణ్, ఫైతం దత్తు, అరుణ్, విపిన్, మెట్టు ప్రహ్లాద్, ఇజ్జగిరి నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

యువత ఉన్నత లక్ష్యాలను సాధించాలి

● స్వామి వివేకానందకు ఘన నివాళ్లర్పించిన జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ ● ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా జాతీయ యువజన దినోత్సవ వేడుకలు ● పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు

ఆదిలాబాద్ అర్బన్, జనవరి 12: స్వామి వివేకానంద జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకుని నేటి యువత ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆదిలాబాద్ కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. జిల్లాకేంద్రంలో శుక్రవారం స్వామి వివేకానంద 161వ జయంతి సందర్భంగా జడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించిన జాతీయ యువజన దినోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించి జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దేశ ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన మహనీయుడు స్వామి వివేకానంద అని కొనియాడారు. మూఢ నమ్మకాలు నమ్మవద్దని యువతరాన్ని ఉత్తేజపరిచి లక్ష్యాన్ని చేరే వరకు విశ్రమించవద్దని యువతకు పిలుపునిచ్చారు. ఉన్నత చదువులు చదివి దేశానికి, సమాజాకి ఉపయోగపడాలని, దేశ భవిష్యత్తును తీర్చిదిద్దే శక్తి యువతరం చేతుల్లోనే ఉందన్నారు. 18ఏళ్లు నిండిన యువతీ, యువకులు ఓటరుగా నమోదు చేసుకోవాలని, వచ్చే పార్లమెంట్ ఎన్నికలలో వంద శాతం తమ ఓటు హక్కును వినియోగించాలని సూచించారు. అనంతరం కార్యక్రమానికి హాజరైన యువతీయువకులు, అధికారులతో ఓటు హక్కు నమోదుపై కలెక్టర్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా యువత ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో అలరించాయి. స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని నిర్వహించిన ఉపన్యాస పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు కలెక్టర్ ప్రశంస పత్రాలు, మెమోంటోలను ప్రధానం చేశారు. అనంతరం పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో వివిధ స్టాళ్లను కలెక్టర్ పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్థానిక వివేకానంద చౌక్‌లోని స్వామివివేకానందుని విగ్రహం వద్ద, స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి కలెక్టర్, యువజన సంఘాల ప్రతినిధులు నివాళులర్పించారు. ఇందులో జిల్లా యువజన సంక్షేమ అధికారి వెంకటేశ్వర్లు, జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ పద్మభూషణ్ రాజు, డీపీఆర్‌వో విష్ణువర్ధన్, కళాకారులు, యువజన సంఘాల ప్రతినిధులు, అధికారులు, యువత, తదితరులు పాల్గొన్నారు.

● అందరికీ ఆదర్శ ప్రాయుడు : ఎమ్మెల్యే పాయల

ఆదిలాబాద్ అర్బన్: భారతదేశ ఖ్యాతిని ప్రపంచానికి చాటి చెప్పిన స్వామివివేకానంద అందరికి ఆదర్శ ప్రాయుడని ఎమ్మెల్యే పాయలశంకర్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని వివేకానంద చౌక్‌లో యువజన సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన స్వామి వివేకానంద జయంతి ఉత్సవాల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశ సంస్కృతి సాంప్రదాయాలను ప్రపంచానికి చాటి చెప్పారన్నారు.

● యువత ఆదర్శ భావాలతో ఎదగాలి : ఎమ్మెల్యే బొజ్జు

ఉట్నూర్: నేటి యువత ఆదర్శ భావాలతో ఎదగాలని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ అన్నారు. శుక్రవారం మండలంలోని హస్నాపూర్‌లో స్వామి వివేకానంద జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరానికి హాజరై మాట్లాడారు. వివేకానందను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు వెళ్లాలన్నారు. యువకులు తల్లిదండ్రులపై భారం కావద్దని వృద్ధాప్యానికి వస్తున్న తల్లిదండ్రులను దేవుళ్లుగా పూజించి ఆదరించాలన్నారు. అలాగే, యువత పుస్తకాలు చదవడం అలవర్చుకోవాలని, పాతతరం వారు నీతి నిజాయితీ అప్యాయతతో ఉండేవారని, వారిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. రక్తదానంలో పాల్గొన్న యువతను అభినందించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ చైర్మన్ రాథోడ్‌జనార్ధన్, పీహెచ్‌సీ వైద్యురాలు ఇప్సిత్, మాన్‌సింగ్ మహరాజ్, బానోత్ జగన్, జాదవ్‌అనిల్, అమృత్ లాల్‌నాయక్ పాల్గొన్నారు.

ఉట్నూర్: మండలకేంద్రంలోని వివేకానంద చౌక్‌లో శుక్రవారం వివేకానంద జయంతి కార్యక్రమాన్ని హిందు ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా సాడిగే రాజగోపాల్ ధ్వజారోహణ చేసిన అనంతరం వివేకానంద చిత్రపటానికి మాజీ ఎంపీ రాథోడ్‌రమేష్, హిందూ ఉత్సవ సమితి నాయకులు అకారపు లక్ష్మణ్, అరికెల అశోక్, ఠాకూర్ గోపాల్‌సింగ్‌ల ఆధ్వర్యంలో వివేకానంద చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో మాజీ ఎంపీ రాథోడ్‌రమేష్ మాట్లాడుతూ యువతరం సామాజిక చైతన్య కార్యక్రమాలను నిర్వహించాలని కోరారు. ఈనెల 22న అయోధ్యలోని రామ జన్మభూమిలో ఆలయ ప్రారంభోత్సవం ఉన్నందున ఇంటింటికీ దీపారాధన చేయడంతో పాటు ప్రతి ఇంటిపై కాషాయ జెండా ఎగురవేయాలని పిలుపునిచ్చారు. హిందువులందరు ఐక్యమత్యంతో ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో లింగన్న, జాదవ్‌కపిల్‌కుమార్, ప్రజ్ఞశీల్, మేస్రం కేశవ్ సంజీవరెడ్డి,కొండగట్టు అంజన్న, బింగి వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.



స్వామివివేకానంద విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఆదిలాబాద్ కలెక్టర్



ఆదిలాబాద్‌లో నృత్యాలు చేస్తున్న విద్యార్థులు

● 'యువత దేశ సేవలో ముందుండాలి'

బోథ్: యువకులు అన్ని రంగాలలో ముందుండి ముఖ్యంగా దేశ సేవ చేసేందుకు సిద్ధంగా ఉండాలని బోథ్ ఎస్సై రాము పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం బోథ్‌లో జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా మాసం లక్ష్మీ వెల్ఫెర్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన టుకే రన్‌ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువకులు సామాజిక స్పృతం పని చేయాలన్నారు. చెడు అలవాట్లకు దూరంగా ఉండి గ్రామీణ ప్రాంతాల్లో పేద ప్రజలకు అండగా నిలవాలన్నారు గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే సమాచారం ఇవ్వాలన్నారు. యువత వివేకా నందున్ని ఆదర్శంగా తీసుకుని పని చేయాలని సూచించారు. దేశ సైన్యంలో పని చేసేందుకు యువకులు ముందుకు రావాలన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీలలో విజేతలకు బహుమతులను అందజేశారు. కాగా మండలంలోని కౌటా(బి) గ్రామంలో వివేకానంద యూత్ ఆధ్వర్యంలో వివేకానంద జయంతి వేడుకలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు ఓరుగంటి స్వామి, డాక్టర్ అశోక్‌రెడ్డి, గంగాధర్, ఉప సర్పంచ్ చిలకడ రవీందర్, రమణగౌడ్‌లతో పాటు యూత్ అధ్యక్షుడు అబ్దుల్, తదితరులు పాల్గొని జయంతి వేడుకలు నిర్వహించారు.

గుడిహత్నూర్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం స్వదేశీ జాగరన్ మంచ్ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద 161వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్వదేశీ జాగరణ మంచ్ జిల్లా కోకన్వీనర్ నాగుల సతీష్ మాట్లాడుతూ స్వామి వివేకానంద జీవితం అందరికీ ఆదర్శమని ఆయన బోధనలు నేటి యువతకు అత్యంత స్ఫూర్తిదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఇంచార్జి ప్రిన్సిపాల్ సూరజ్‌సింగ్, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ ఆడే సునీల్, బీజేపీ మండల ఉపాధ్యక్షుడు తరుణ్ గిత్తే, కళాశాల అధ్యాపకులు, కళాశాల విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

తలమడుగు: మండల కేంద్రంలో స్వామి వివేకానంద 161వ జయంతిని బ్లూ బీమ్ సామాజిక సేవ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించారు. సామాజిక సేవ కార్యకర్త బ్లూ బీమ్ యూత్ అధ్యక్షుడు గొంటిముక్కుల ప్రేమేందర్ మాట్లాడుతూ దేశ చరిత్రలో ప్రముఖ వ్యక్తి ప్రఖ్యాత ఆధ్యాత్మికుడు యువతకు స్ఫూర్తి ప్రదాత స్వామి వివేకానంద ఈ దేశంలో యువతే ఈ దేశపు భవిష్యత్ యువత బలహీన పడకుండా అకుంఠిత దీక్ష తో ముందుకు సాగితే ఏదైనా సాధించే సత్త భారతీయ యువతకు సాధ్యమవుతుంది. సేవా మార్గంలో దేశం కోసం యువత ముందుకు రావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్లూ బీమ్ యూత్ అధ్యక్షుడు ప్రేమేందర్, ఆనంద్‌రెడ్డి, శివ, అజయ్,మహేశ్, విలాస్, తదతరులు పాల్గొన్నారు.



బోథ్ బస్టాండ్‌లో 2కే రన్ ప్రారంభిస్తున్న ఎస్సై రాము



ఉట్నూర్‌లో వివేకానంద జయంతిని నిర్వహిస్తున్న దృశ్యం



హస్నాపూర్‌లో రక్తదాన శిబిరంలో పాల్గొన్న ఎమ్మెల్యే, జడ్పీ చైర్మన్



వివేకానంద చౌక్‌లో నివాళ్లర్పిస్తున్న ఎమ్మెల్యే పాయల శంకర్



గుడిహత్నూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో స్వామి వివేకానంద జయంతిని నిర్వహిస్తున్న దృశ్యం

స్వామి వివేకానంద స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకోవాలి

● నిర్మల్ జిల్లాలో ఘనంగా స్వామి వివేకానంద జయంతి ● నివాళులు అర్పించిన నాయకులు



స్వామి వివేకానంద విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి



నివాళులర్పిస్తున్న ఆర్ఎస్ఎస్ నాయకులు



బాసరలో రక్తదాన శిబిరంలో పాల్గొన్న స్థానికులు

నిర్మల్ అర్బన్, జనవరి 12 : స్వామి వివేకానంద జయంతి సందర్భంగా జిల్లా కేంద్రంలోని వివేకానంద చౌరస్తాలో గల స్వామి వివేకానంద విగ్రహానికి శుక్రవారం పూలమాల వేసి ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ... వివేకానందుని స్ఫూర్తి యువతరానికి ఎంతో మేలు చేస్తుందని, యువత వాటిని ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు అయ్యన్నగారి భూమయ్య, రావుల రాంనాథ్, సాధం అరవింద్, భూపతిరెడ్డి, అర్జున్, మార గంగారెడ్డి, తిరుమలచారి, సాగర్, నారాయణగౌడ్, వెంకటేష్, శ్రావణ్, కార్తీక్, భోజన్నలతో పాటు తదితరులు పాల్గొన్నారు.

నిర్మల్ కల్చరల్ : యువతకు వివేకానంద స్వామి ఆదర్శప్రాయుడని ఆయన మార్గ దర్శనంలో నడవాలని మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్ పిలుపునిచ్చారు. శుక్రవారం స్వామి వివేకానంద జయంతి సందర్భంగా ఆయన వివేకానంద విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... దేశ ఔనత్యాన్ని దశదిశల చాటిన మహోన్నత వ్యక్తి అని ప్రస్తుతించారు. ఆయన దేశ భక్తికి గుర్తుగా ఆయన జయంతిని యువజనోత్సవంగా జరుపుకుంటున్నామని తెలిపారు. అన్ని రంగాల్లో యువత ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. ప్రముఖ నాయకులు ఆయన వెంట పాల్గొన్నారు.

ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో...

రాష్ట్రీయ స్వయం సేవక్ ఆధ్వర్యంలో శుక్రవారం స్వామి వివేకానంద జయంతి వేడుకలు నిర్వహించారు. వివేకానంద స్వామి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఇందూర్ విభాగ్ ప్రచారక్ శివకుమార్, అల్లాడి సూర్యనారాయణ, డాక్టర్ యు. కృష్ణంరాజు, కిన్నెర రవి, నరేష్, ప్రణయ్, సాయికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

స్వామి వివేకానంద జయంతి పురస్కరించుకుని శుక్రవారం తెలంగాణ విద్యార్థి పరిషత్ విద్యార్థులు ఆయన విగ్రహానికి ఘన నివాళులర్పించారు. ఆర్గనైజింగ్ కార్యదర్శి కే.ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ... ప్రపంచ వ్యాప్తంగా ఆయన ప్రసంగాలతో యువతను ఉత్తేజపరిచి ఆలోచింపజేశాడని కొనియాడారు. కన్వీనర్ సాయిచరణ్, రిత్విక్, జాదవ్ మిథున్, గణేష్; రాహుల్, తదితర విద్యార్థి సంఘ నాయకులు పాల్గొన్నారు.

కావేరి గ్రంథాలయంలో..

నిర్మల్‌లోని కావేరి గ్రంథాలయంలో శుక్రవారం స్వామి వివేకానంద జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కావేరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో వివేకానందుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. లైబ్రేరియన్ దీపక్ మాట్లాడుతూ... యువత ఆయన మార్గాన్ని అనుసరిస్తూ ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. దేశానికి ఆయన చేసిన సేవ ఎనలేనిదని ప్రపంచం గర్వించే మహావ్యక్తి వివేకానందుడని కొనియాడారు. పోలీస్ భీమేష్, రాజమణి, గోపి, స్రవంతి, తదితరులు పాల్గొన్నారు.

బాసర : స్వామి వివేకానంద జయంతి వేడుకలు శుక్రవారం బాసర మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. బస్టాండ్ వద్ద గల స్వామివివేకానంద విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో రక్తదాన శిబిరాన్ని స్థానిక యువత ఏర్పాటు చేసింది. యువకులు, వివిధ పార్టీల నాయకులు పాల్గొని రక్తదానం చేశారు. ఈ సందర్భంగా స్వామి వివేకానంద జీవిత చరిత్ర, ఆయన సూచించిన మార్గాన్ని గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్ఐ గణేష్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ..

నిర్మల్ చైన్‌గేట్ : ప్రభుత్వ డిగ్రీ కళాశాల నిర్మల్‌లో జాతీయ సేవా పథకం, పిల్లల కోసం తొలిమెట్టు ఆధ్వర్యంలో వివేకానంద 161 జయంతి పురస్కరించుకొని శుక్రవారం జాతీయ యువ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కమిషనర్ కాలేజీ ఎడ్యుకేషన్, పాఠశాల విద్య పిల్లల కోసం తొలిమెట్టు ఉద్యమం ఎన్‌జీవో చేపట్టిన ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు వారంలో ఒక్కరోజు విద్యా బోధన చేస్తున్నారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ వాలంటీర్లను జిల్లా కలెక్టర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ భీమ్‌రావు, డీఈవో రవీందర్ రెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పిల్లల కోసం కోఆర్డినేటర్ ఆర్. నాగేశ్వర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ వి. సరితా రాణి, డీఈవో ఆఫీస్ ప్రవీణ్ కుమార్, కళాశాల అధ్యాపక బృందం, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

కుభీర్ : మండల కేంద్రంతో పాటు మండలంలోని చొండి, సొనారి, మాలేగాం తదితర గ్రామాల్లో స్వామి వివేకానంద జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. బీజేపీ నాయకులు వడ్నం నాగేశ్వర్, ప్యాట లక్ష్మణ్‌లు పాల్గొన్నారు. మండల కేంద్రంకుభీర్‌లోని వివేక నందా చౌరస్తా వద్ద ఈ సందర్భంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎన్నిల అనీల్, పి. విజయ్ కుమార్, పీ సతీష్, బి. అభిషేక్, పోతన్న, మధుసూధన్, వివేక్, అరవింద్, కే. శ్రీనివాస్, యూత్ నాయకులున్నారు.

ముథోల్ : మండల కేంద్రమైన ముథోల్‌లో శుక్రవారం స్వామి వివేకానంద 161 జయంతిని ఘనంగా నిర్వహించారు. అంతకుముందు ముథోల్‌లో హిందూవాహిని ఆధ్వర్యంలో అన్నబాహు సాటే, స్వామి వివేకానంద, భగత్ సింగ్ విగ్రహాల ఏర్పాటుకు భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో ముథోల్ మండల అధ్యక్షుడు కోరి పోతన్న, తాటివార్ రమేష్, డైరెక్టర్ ధర్మపురి సుదర్శన్, సోమేష్ పటేల్ పాల్గొన్నారు.

అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలి

● ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

దస్తూరాబాద్, జనవరి 12 : అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటూ బాధ్యతాయుతంగా పని చేయాలని ఖానాపూర్‌ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులు నివేదికలు వినిపించారు. అనంతరం ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ మాట్లాడుతూ... అధికారులు ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈ ప్రాంత సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానన్నారు. బీఆర్ఎస్ నాయకులు అధికారులపై అధికారం చలాయించడం ఏంటని అన్నారు. జీవో నెంబర్ 317 విషయంపై సీఎం రేవంత్ రెడ్డి పంచాయతీ రాజ్, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క దృష్టికి తీసుకెళ్లానని తెలిపారు. ఈ జీవోను రద్దు చేసి ఉద్యోగులకు న్యాయం చేస్తామన్నారు. అధికార నాయకులు, ప్రతిపక్ష నాయకులు, ప్రభుత్వ అధికారులు కలిసికట్టుగా ఉండి అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

పీవోడబ్ల్యూ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

నిర్మల్ కల్చరల్, జనవరి 12 : సంక్రాంతి సందర్భంగా శుక్రవారం పీవోడబ్ల్యూ ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో సోఫీనగర్‌లో ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులను అందజేశారు. కే. లక్ష్మి, ఎస్. లక్ష్మి, కే. రాజన్న, తదితరులు పాల్గొన్నారు. ముగ్గుల పోటీలు మహిళల్లో ఉత్సాహాన్ని నింపుతాయని పలువురు అన్నారు. అనసూయ, సునంద, రాజవ్వ, జమున, గంగవ్వ హాజరయ్యారు.

అగ్ని ప్రమాదాల పట్ల అప్రమత్తత అవసరం

నిర్మల్ కల్చరల్, జనవరి 12 : అగ్ని ప్రమాదాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని అగ్నిమాపక అధికారి డి. జయంత్ రామ్ అన్నారు. శుక్రవారం సోఫీనగర్‌లోని సంతోష్ గుప్తా పెట్రోల్ బంక్‌లో అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ప్రమాదం సంభవిస్తే నీటితో ఆర్పవద్దని సీవో 2 సిలిండర్ ఉపయోగించి మంటలను ఆర్పాలన్నారు. అగ్ని ప్రమాదాలు అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ ముందు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సిబ్బంది పాల్గొన్నారు.

జాబ్ మేళాను ఉపయోగించుకోవాలి

నిర్మల్ కల్చరల్, జనవరి 12 : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన విదేశీ ఉద్యోగాల కోసం నిర్వహించిన జాబ్ మేళా సద్వినియోగం చేసుకోవాలని జిల్లా జడ్పీటీసీల ఫోరమ్ అధ్యక్షుడు పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి కోరారు. శుక్రవారం నిర్మల్‌లో ఏర్పాటు చేసిన విదేశీ ఉద్యోగ మేళాలో ఆయన పాల్గొన్నారు. గల్ఫ్ దేశాలకు కాకుండా ఇజ్రాయిల్ దేశానికి నిర్మాణ పనుల కోసం శిక్షణ పొంది వెళ్లేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ఉపాధి కల్పన అధికారి రాములు మాట్లాడుతూ... 90 మంది కార్మికుల నుండి దరఖాస్తులు స్వీకరించామన్నారు. టాంకామ్ సంస్థ ప్రభుత్వ ఏజెన్సీ ద్వారా ఉద్యోగ మేళా నిర్వహించిందన్నారు. అర్హులకు ఫోన్ ద్వారా సమాచారం అందజేస్తామన్నారు. ప్రిన్సిపాల్ కృష్ణమూర్తి, ప్రవాసి మిత్ర నాయకుడు స్వదేశ్, తదితరులు పాల్గొన్నారు.

చింతకుంటలో రాములోరి అక్షింతల శోభాయాత్ర

ముథోల్, జనవరి 12 : మండలంలోని చింతకుంట గ్రామంలో శుక్రవారం అయోధ్య అక్షింతల సందర్భంగా తీర్థ క్షేత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో అక్షింతల కలశాలతో శ్రీ రాములోరి శోభాయాత్రను ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని ఆయా వీధుల్లో గ్రామ పెద్దలు, గ్రామస్థులు, మహిళలు మంగళహారతులతో అధిక సంఖ్యలో పాల్గొని శ్రీ రాములోరి భక్తి భజనలు చేస్తూ గ్రామంలో ఊరేగింపుగా నిర్వహించిన హనుమాన్ మందిరానికి చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రాజేందర్ రెడ్డి, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.



నిర్మల్ టూ ఆంధ్ర

- జిల్లాలోని రైస్ మిల్లర్ల ఇష్టారాజ్యం
- మందపెల్లికి తరలుతున్న సీఎంఆర్ ధాన్యం
- కలెక్టర్ హెచ్చరికలను బేఖాతరు చేస్తున్న రైస్‌మిల్లర్లు
- రెండేళ్ల నుంచి యథేచ్ఛగా సాగుతున్న దందా
- చోద్యం చూస్తున్న అధికార యంత్రాంగం

నిర్మల్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో సీఎంఆర్ బియ్యం వ్యవహారం కొత్త పుంతలు తొక్కుతోంది. ఓ వైపు సీఎంఆర్ బియ్యం పక్కదోవ పడుతుండగా మరోవైపు సీఎంఆర్ ధాన్యం యథేచ్ఛగా సరిహద్దులు దాటుతోంది. జిల్లా నుంచి ప్రతీరోజూ నాలుగైదు లారీల సీఎంఆర్ ధాన్యం మందపెల్లికి తరలుతున్నట్లు ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. నిర్మల్ పట్టణంలోని సోఫీనగర్‌కు చెందిన ఓ రైస్‌మిల్లు నుంచి ఈ సీఎంఆర్ ధాన్యం ప్రతీరోజూ అక్రమ మార్గాల గుండా తరలిపోతున్నట్లు చెబుతున్నారు. నిర్మల్‌లో ఉండే జగిత్యాల జిల్లాకు చెందిన ఓ ఇసుక వ్యాపారి ఇటీవలే సీఎంఆర్ ధాన్యం, బియ్యం దందా మొదలుపెట్టినట్లు చెబుతున్నారు. సదరు వ్యాపారి కనుసైగలతోనే ధాన్యమంతా పెద్దమొత్తంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి తరలిపోతున్నట్లు పేర్కొంటున్నారు. గత రెండేళ్ల నుంచి సీఎంఆర్ ధాన్యం విషయంలో రైస్‌మిల్లులు కొనసాగిస్తున్న అవకతవకలపై అప్పటి ప్రభుత్వం కఠినచర్యలు తీసుకోని కారణంగానే ఈ అక్రమదందా అడ్డూ అదుపు లేకుండా పోతోందని అంటున్నారు. అధికారుల ఉదాసీన వైఖరి, మిల్లర్ల రాజకీయ పలుకుబడి, పరపతి కారణంగా రెండేళ్ల నుంచి ఖరీఫ్, రబీసీజన్‌లకు సంబంధించిన సీఎంఆర్ వ్యవహారంలో అక్రమాలకు అడ్డు అదుపు లేకుండా పోతోందని అంటున్నారు. జిల్లాలోని కొంతమంది రైస్‌మిల్లుల యజమానులు సిండికేట్‌గా ఏర్పడి గత రెండేళ్ల నుంచి యథేచ్ఛగా సర్కారు నిబంధనలను తుంగలో తొక్కు తూ అక్రమ దందాను సాగిస్తున్న విషయం బహిరంగ రహస్యమే. ప్రస్తు తం రైస్‌మిల్లర్ల వద్ద 2022 సంవత్సరానికి సంబంధించిన సీఎంఆర్ ధాన్యం అలాగే బియ్యంతో పాటు ఈ సంవత్సరం ఖరీఫ్‌కు సంబంధించిన ధాన్యం కూడా కుప్పలు తెప్పలుగా ఉన్నట్లు చెబుతున్నారు. సీఎంఆర్ బియ్యం కోసం ఇప్పటికే మూడుసార్లు గడువు పొడగించినప్పటికీ రైస్‌మిల్లర్లు మాత్రం బియ్యాన్ని సర్కారుకు అప్పజెప్పడం లేదంటున్నారు. దీంతో ప్రభుత్వం మరోసారి గడువును పెంచడం ప్రాధాన్యతను సంతరించుకుంటోంది. ఈ నెల 31వ తేదీ వరకు అన్ని రైస్‌మిల్లుల యజమాన్యాలు సీఎంఆర్ బియ్యాన్ని అప్పజెప్పాలంటూ ప్రభుత్వం ఆదేశించింది. అయినప్పటికీ సీఎంఆర్ ధాన్యం మిల్లింగ్ విషయంలో రైస్‌మిల్లు యాజమాన్యా లు ఇప్పటికీ రోజువారి టార్గెట్‌ను అధిగమించడం లేదన్న ఆరోపణలున్నాయి. ఇదే పరిస్థితి కొనసాగితే పెంచిన గడువులోగా కూడా మిల్లింగ్ ప్రక్రియ పూర్తికావడం కష్టమేనంటున్నారు. అయితే ఈ వ్యవహారమంతా వ్యూహాత్మకంగానే సాగుతోందంటున్నారు. రైస్‌మిల్లు యాజమాన్యాలు సిం డికేట్‌గా ఏర్పడి సీఎంఆర్ విషయంలో అవకతవకలు కొనసాగిస్తున్నారన్న విమర్శలున్నాయి. ఈ నేపథ్యంలోనే జిల్లా కలెక్టర్ అశిష్ సంగ్వాన్ రెండు రోజుల క్రితం సంబంధిత అధికారులతోనూ అలాగే రైస్‌మిల్లర్లతోనూ సమీ క్ష సమావేశం ఏర్పాటు చేసి హెచ్చరికలు జారీ చేశారు. ఈ సారైనా కలెక్టర్ హెచ్చరికలు ఫలిస్తాయో లేదోనన్న ఆసక్తి నెలకొంటోంది.

ఆంధ్రాకు తరలుతున్న ధాన్యం

గతానికి భిన్నంగా రైస్‌మిల్లు యాజమాన్యాలు స్థానికంగా దందాను కొనసాగించడమే కాకుండా ధాన్యానికి డిమాండ్ ఉన్న ఆంధ్రప్రదేశ్‌పై కన్నేశారంటున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని మందపెల్లికి చెందిన కొంతమంది వ్యాపారులతో ఇక్కడి రెండు రైస్‌మిల్లుల యాజమాన్యాలు రహస్య ఒప్పందం కుదుర్చుకున్నాయన్న విమర్శలున్నాయి. దీని ప్రకారం జిల్లా కేంద్రంలోని సోఫీనగర్‌లో గల రైస్‌మిల్లు నుంచి ప్రతీరోజూ నాలుగైదు లారీల సీఎంఆర్ ధాన్యం ఆంధ్రప్రదేశ్‌కు తరలిపోతున్నట్లు విశ్వసనీయ సమాచారం. గత రెండు రోజుల క్రితమే జిల్లా కలెక్టర్ సీఎంఆర్ ధాన్యం మిల్లింగ్ విషయంలో హెచ్చరికలు జారీ చేసినప్పటికీ ఆ హెచ్చరికలను సదరు రైస్‌మిల్లు యాజమాన్యం బేఖాతరు చేస్తున్నట్లు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కఠినచర్యలు తీసుకుంటామంటూ కలెక్టర్ హెచ్చరించినప్పటికీ స్థానిక సోఫీనగర్ నుంచి మాత్రం సీఎంఆర్ ధాన్యం ఆంధ్రాకు తరలింపు ఆగకపోవడం ప్రాధాన్యతను సంతరించుకుంటోంది. రాజకీయ పలుకుబడి గల కొంతమంది రైస్‌మిల్లు యజమానులు అలాగే జగిత్యాలకు చెందిన ఓ వ్యాపారి ఈ దందాకు అసలు సూత్రధారులుగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలున్నాయి.

చక్రం తిప్పుతున్న సిండికేట్

సీయంఆర్ విషయంలో జిల్లాలోని కొంతమంది రైస్‌మిల్లు యజమానులు సిండికేట్‌గా ఏర్పడి చక్రం తిప్పుతున్నారన్న ఆరోపణలున్నాయి. సదరు రైస్‌మిల్లు యజమానులు అధికారుల హెచ్చరికలను బేఖాతరు చేస్తూ మూడు నాలుగు సంవత్సరాల నుంచి సీఎంఆర్ ధాన్యం మిల్లింగ్ విషయంలో అక్రమాలకు పాల్పడుతున్నారంటున్నారు. మిల్లింగ్ కెపాసిటీ పేరిట ధాన్యాన్ని మిల్లింగ్ చేయకుండా జాప్యం చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. దీని వెనక అసలు కారణం వేరే ఉందని అంటున్నారు. తమ వద్ద ఉన్న ధాన్యం నిల్వలను మిల్లింగ్ చేయకుండా అక్రమంగా తరలిస్తూ అమ్ముకుంటున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రతిసారి సీఎంఆర్ గడువును పొడగించడం, సర్కారు ఆదేశాలను ఉల్లంఘించడం రైస్‌మిల్లుల యజమానులకు సాధారణమైందంటున్నారు. తమకున్న పలుకుబడి, పరపతితో అందరిని ప్రభావితం చేసే విధంగా మిల్లర్ల అక్రమాలను అడ్డుకునే సాహసం కూడా ఎవరూ చేయడం లేదని చెబుతున్నారు. ఇటీవల జరిగిన జడ్పీ సర్వసభ్య సమావేశంలో కూడా సీఎంఆర్ బియ్యం అక్రమాల విషయంలో పలువురు జడ్పీటీసీ సభ్యులు అధికారులపై మండిపడ్డ సంగతి తెలిసిందే. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ అశిష్ సంగ్వాన్ సీయంఆర్ ధాన్యం, బియ్యం విషయంలో పకడ్బందీ చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వెంకటేశ్వర స్వామికి 108 పాత్రల్లో నైవేద్యం



మామడ, జనవరి 12 : ధనుర్మాసవ్రత మహోత్సవంలో భాగంగా మండలంలోని పొన్కల్ గ్రామంలో పొనకంటి శ్రీ మహాలక్ష్మి గోదా సమేత శ్రీ వెంకటేశ్వర స్వామివారి ఆలయంలో కూడారై మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 108 గంగాళాలలో పాయసాన్ని స్వామి వారికి నివేదన చేసి భక్తులకు ప్రసాదంగా వినియోగించారు. ఆలయ అర్చకులు విజయసారథి రామచంద్రాచార్యులు కూడారై ప్రాముఖ్యతను భక్తులకు తెలియజేశారు. ఈ సందర్భంగా తెల్లవారు జామునే మహిళలు అధిక సంఖ్యలో మంగళహారతులతో ఆలయానికి విచ్చేసి కూడా రై ప్రత్యేక పూజలో పాల్గొని స్వామివారి ఆశీస్సులను పొందారు. ఈ కార్య క్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు, ప్రజా ప్రతినిధులందరూ పాల్గొన్నారు.

ఆలయాల్లో కూడారై ఉత్సవం



దేవరకోటలో కూడారై నిర్వహిస్తున్న అర్చకులు

నిర్మల్ కల్చరల్, జనవరి 12 : ధనుర్మాస సందర్భంగా శుక్రవారం జిల్లా కేంద్రంలోని దేవరకోట, బాగులవాడ వాల్మీకినగర్ రామాలయంలో కూడారై ఉత్సవాన్ని వైష్ణవ సాంప్రదాయం ప్రకారం నిర్వహించారు. రామాలయంలో కోవెల శ్రీనివాసచారి ఆధ్వర్యంలో 108 కలశాలలో క్షీరాన్నం తయారు చేసి ఆండాళ్ అమ్మవారికి నైవేద్యాన్ని నివేదించారు. భక్తులకు ప్రవచనం తరువాత తీర్థప్రసాదాలు అందజేశారు.

భైంసా వేంకటేశ్వరస్వామి ఆలయంలో..



శోభాయమానంగా అలంకరించబడిన ఉత్సవమూర్తులు

భైంసా, జనవరి 12 : పట్టణంలోని పద్మావతి కాలనీ పరిధిలో గల శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో ధనుర్మాస ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాలలో భాగంగా శుక్రవారం ఉదయం కూడారై మహోత్సవం భక్తుల కోలాహలం మధ్య ఘనంగా జరిగింది. పట్టణ భక్తులతో పాటు సమీప గ్రామాల భక్తులు వేడుకల్లో పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలు చేపట్టారు. కూడారై మహోత్సవములో భాగంగా 108 గంగాళములలో పాయసాన్ని శ్రీ గోదారంగనాథుల స్వామికి నైవేద్యంగా ప్రసాదించారు. అనంతరం సంబంధిత నైవేద్యాన్ని భక్తులక ప్రసాదంగా అందించారు. ఆలయ అర్చకులు అచార్య మల్యాల హరిబాబు ప్రవచన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆదివారం జరుగనున్న శ్రీ గోదా రంగనాథుల కళ్యాణోత్సవ వేడుకలతో ధనుర్మాస ఉత్సవాలు ముగియనున్నాయి.

మార్కండేయ విగ్రహం కోసం రూ. 2.35 లక్షల విరాళం

దిలావర్‌పూర్, జనవరి 12 : మండలంలోని కాల్వ గ్రామంలో ఇటీవల నూతనంగా శ్రీ మార్కండేయస్వామి దేవాలయం నిర్మించారు. ఆలయంలో ప్రతిష్ఠించేందుకు మూల విరాట్ శ్రీ మార్కండేయ స్వామి విగ్రహం కోసం మాజీ డిప్యూటీ స్పీకర్ అయిండ్ల భీమ్‌రెడ్డి తనయుడు చంద్రమోహన్‌రెడ్డిని కాల్వ గ్రామస్థులు కలిసి సహకారం కోరారు. గ్రామస్థుల కోరిక మేరకు చంద్రమోహన్‌రెడ్డి రూ. 2.35 లక్షల విరాళం అందజేశారు.

బఫర్‌జోన్‌లో చెరువులు ఆక్రమిస్తే కఠినచర్యలు

- అదనపు కలెక్టర్ కిషోర్‌కుమార్
- సరస్సు రక్షణ కమిటీ ఏర్పాటు



సమావేశంలో మాట్లాడుతున్న కిషోర్‌కుమార్

నిర్మల్ కల్చరల్, జనవరి 12 : బఫర్‌జోన్ పరిధిలో ఎవరైనా చెరువులు ఆక్రమిస్తే కఠిన చర్యలుంటాయని ఇప్పటికే రెండు కేసులు నమోదైనట్లు అదనపు కలెక్టర్ కిషోర్‌కుమార్ తెలిపారు. శుక్రవారం సరస్సు రక్షణ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఈ చెరువుల పరిరక్షణ కమిటీలో అదనపు ఎస్పీ, ఆర్డీవో, ఇరిగేషన్ ఈఈ, సర్వేల్యాండ్ ఏడీ, మున్సిపల్ కమిషనర్లు సభ్యులుగా ఉంటారన్నారు. చెరువులు ఆక్రమణకు గురికాకుండా ఉండేందుకు ఈ కమిటీలు కృషి చేస్తాయన్నారు. అదనపు కలెక్టర్‌తో సహా సభ్యులు కలిసి చెరువులను పరిశీలిస్తారన్నారు. ఎఫ్‌టీఎల్ సర్వేనెంబర్లను గుర్తించి నివేదిక సమర్పిస్తామన్నారు. ఆక్రమణలు అరికట్టేందుకు పోలీసుశాఖ సహకారం తీసుకుని చర్యలు చేపడతామన్నారు. ఆక్రమించిన వారిపై క్రిమినల్ చర్యలుంటాయని హెచ్చరించారు. చెరువుల సంరక్షణపై అధికారులకు పలు సూచనలు చేశారు. డీఎస్పీ గంగారెడ్డి, ఆర్డీవో రత్నకల్యాని, ఇరిగేషన్ ఈఈ రామారావు, ల్యాండ్ సర్వే ఏడీ సుదర్శన్, కడెం ఈఈతో పాటు నిర్మల్ మున్సిపల్ కమిషనర్ సీఎస్ రాజు, కడెం, నిర్మల్ తహసీల్దార్లు పాల్గొన్నారు.

14 నుంచి జంతు సంక్షేమ వారోత్సవాలు

ఈ నెల 14 నుంచి 31 వరకు జంతు సంక్షేమ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ తెలిపారు. శుక్రవారం అధికారులతో అవగాహన సమావేశం నిర్వహించారు. జంతుహింస నివారణకు ప్రభుత్వం చట్టం తీసుకొచ్చిందన్నారు. ప్రతి పౌరుడు చట్టాన్ని పాటించాలన్నారు. నిబంధనలు తెలియజేశారు. 15 రోజులపాటు ఈ కార్యక్రమాన్ని నిర్వహించి అవగాహన కల్పించాలని సూచించారు. వెటర్నరీ అధికారి గంగాధరయ్య, ఆర్డీవో అజయ్ కుమార్, తదితర అధికారులు పాల్గొన్నారు.

భైంసా ఎంపీపీ పీఠం బీజేపీ కైవసం

- ఏకగ్రీవంగా జరిగిన ఎన్నిక
- హాజరైన ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్

భైంసా, జనవరి 12 : మండల ఎంపీపీ పీఠం బీజేపీ కైవసం చేసుకుంది. అసెంబ్లీ ఎన్నికల ఫలితాల అనంతరం ముథోల్ నియోజకవర్గ పరిధిలో రాజకీయ మార్పులు, చేర్పులు చోటు చేసుకున్నాయి. ఇది వరకు భైంసా ఎంపీపీగానున్న బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఎంపీపీ కల్పనా గణేష్, వైస్ ఎంపీపీ గంగాధర్‌లు వారం రోజుల క్రితం తమ పదవులకు రాజీనామా చేశారు. దీంతో అధికార యంత్రాంగం శుక్రవారం ఎంపీపీ, వైస్ ఎంపీపీ కోసం ఎన్నిక నిర్వహించింది. ఇందులో బీజేపీకి చెందిన మిర్జాపూర్ ఎంపీటీసీ సభ్యుడు అబ్దుల్‌రజాక్, ఇటీవల బీజేపీకి మద్ధతుదారుడిగా మారిన కామోల్ ఎంపీటీసీ నర్సారెడ్డిలు ఎంపీపీ, వైస్ ఎంపీపీలుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారి క్రాంతికుమార్ సమక్షంలో ఎంపీపీ, వైస్ ఎంపీపీ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. ఎన్నికల ప్రక్రియ ముగిసిన అనంతరం ఎంపీపీ రజాక్ మాట్లాడుతూ.. తాను ఎన్నో సంవత్సరాలుగా గడ్డెన్న కుటుంబానికి సన్నిహితంగా ఉన్న తనకు ఎంపీపీ పదవి ఇస్తానని మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి, అతని సోదరుడు సూర్యంరెడ్డిలు మోసం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. తాను మైనారిటీ వర్గానికి చెందిన వాడినైనా ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ తనకు ఎంపీపీ పదవి కట్టబెట్టినందుకు ఎంపీపీ రజాక్ కృతజ్ఞతలు తెలియజేశారు. ఎమ్మెల్యే నమ్మకాన్ని వమ్ము చేయకుండా తాను ముందుకు సాగుతానన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే రామారావు పటేల్ మాట్లాడుతూ.. ముథోల్ నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో నెలకొన్న సమస్యలను దశల వారీగా పరిష్కరిస్తానన్నారు. అన్నీ గ్రామాల్లో బీజేపీ జెండా ఎగురవేయడమే తన లక్ష్యమన్నారు. బీజేపీ దేశద్రోహులకు మాత్రమే వ్యతిరేఖమని, ఏ కులానికి, మతానికి వ్యతిరేకం కాదన్నారు. అనంతరం ఎమ్మెల్యే రామారావు పటేల్ కొత్తగా ఎన్నికైన ఎంపీపీ రజాక్, వైస్ ఎంపీపీ నర్సారెడ్డిలను సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ రాజేష్‌బాబు, మాజీ మున్సిపల్ చైర్మన్ గంగాధర్, జడ్పీటీసీ సోలంకి దీపా భీంరావు పటేల్, నాయకులు పండిత్‌రావు పటేల్, బాజీరావు, సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.



ఎంపీపీ రజాక్‌కు అధికారులు అందిస్తున్న ప్రమాణ స్వీకార పత్రాలు

దారి కాచి మామ అల్లుడిపై గొడ్డళ్లతో దుండగుల దాడి

- మామ మృతి.. అల్లుడి పరిస్థితి విషమం
- నిర్మల్‌లో దారుణం



బుచ్చన్న మృతదేహం

నిర్మల్ రూరల్, జనవరి 12 : జిల్లాలోని బంగల్‌పేట్ జంగల్ హనుమాన్ వద్ద మామ అల్లుడిపై జరిగిన దాడిలో మామ పోలీసు బుచ్చన్న అక్కడికక్కడే మరణించాడు. అల్లుడు వెంకటేష్ పరిస్థితి విషమంగా మారడంతో ఆయనను నిర్మల్ గవర్నమెంట్ హాస్పిటల్‌కు తరలించారు. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. నిర్మల్ మండలం అనంతపేట్ గ్రామానికి చెందిన పోలీసు బుచ్చన్న(60) అలాగే ఆదిలాబాద్‌కు చెందిన ఆయన చిన్న అల్లుడు వెంకటేశ్వర్లు(35) మోటార్ బైక్‌పై నిర్మల్ నుంచి అనంతపేట్‌కు వెళ్తుండగా ఈ దాడి జరిగింది. పాతకక్షల కారణంగానే అదే గ్రామానికి చెందిన కొందరు పథకం ప్రకారం గొడ్డళ్లతో ఈ దాడి జరిపినట్లు పోలీసులు చెబుతున్నారు. బైక్‌పై వస్తున్న వీరిద్దరినీ దుండగులు మొదట కర్రలతో కొట్టి ఆపిన తర్వాత గొడ్డళ్లతో దాడికి పాల్పడ్డారు. మొదట మృతుడు బుచ్చన్నపై గొడ్డలితో దాడి చేయగా ఆయన అక్కడికక్కడే మరణించాడు. బైక్‌పై వెనుక కూర్చున్న వెంకటేష్ పారిపోయేందుకు ప్రయత్నించగా ఆయనను కూడా వెంబడించి దుండగులు గొడ్డళ్లతో కడుపులో నరికారు. ఈ దాడిలో వెంకటేష్ కడుపులోని పేగులు బయటకు వచ్చాయి. స్థానికులు వెంటనే వెంకటేష్‌ను గవర్నమెంట్ హాస్పిటల్‌కు తరలించారు. ఇక్కడి డాక్టర్లు ఆయనకు శస్త్ర చికిత్సలు నిర్వహిస్తున్నారు. ఆయన పరిస్థితి విషమంగానే ఉన్నట్లు డాక్టర్లు తెలిపారు. ఇదిలా ఉండగా సంఘటన స్థలానికి ఎస్పీ జానకి షర్మిల, డీఎస్పీ గంగారెడ్డి, రూరల్ సీఐ శ్రీనివాస్‌లు కొన్ని పరిస్థితులను సమీక్షించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. పాత కక్షల కారణంగానే ఈ దాడి జరిగి ఉండవచ్చని, విచారణ జరుపుతున్నామని, నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు వివరించారు. కాగా మృతుడి అల్లుడు వెంకటేష్ సంక్రాంతి పండుగ కోసం అనంతపేట్‌లోని అత్తవారింటికి వచ్చి ఈ దాడికి గురయ్యాడు.

ఆక్రమణకు గురైన కాలువలో పూడిక తీత



నర్సాపూర్(జి), జనవరి 12 : మండల కేంద్రంలోని దేవుని చెరువు కాలువ భూములను కొందరు రియల్ వ్యాపారులు రోడ్డు వేసి పూడ్చేశారు. ప్రజా ఫిర్యాదుల విభాగంలోపోలీస్ స్టేషన్‌లో సైతం ఫిర్యాదు చేసినా ఇరిగేషన్ అధికారులు పట్టించుకోలేదు. గ్రామానికి చెందిన నలభై ఎకరాల ఆసామి అప్పాల రాజ గంగూ బాయి తన సొంత నిధులతో ఆక్రమణకు గురైన కాలువ భూముల్లో పూడికను జేసీబీతో తీయిస్తున్నారు. మహిళ చేస్తున్న మంచి పనికి మండల వాసులు శభాష్ అమ్మవ్వ అని ప్రశంసిస్తున్నారు. మహిళా రైతు చేస్తున్న సహసానికి రెండు చెరువుల నించి మూడు వందల ఎకరాలకు నీరు అందుతుందని రైతులు గర్వంగా చెప్పుకుంటున్నారు.

సంక్షిప్త సమాచారం



స్టార్ ఫంక్షన్ హాల్‌ను సీజ్ చేస్తున్న అధికారులు

పన్ను బకాయిలు చెల్లించలేదని
స్టార్ ఫంక్షన్ హాల్ సీజ్

నిర్మల్ కల్చరల్, జనవరి 12 : జిల్లా కలెక్టర్ ఆదేశానుసారంగా మున్సిపల్ రెవెన్యూ విభాగం అధికారులు స్థానిక స్టార్ ఫంక్షన్‌హాల్‌ను శుక్రవారం సీజ్ చేశారు. రూ. 12,09,041లు యజమాని వహీద్ అహ్మద్ పన్ను బకాయిలున్నారని రెవెన్యూ అధికారి టి. గంగాధర్ తెలిపారు. ఆర్ ఐ శ్రీనివాస్, షాకీర్‌ఖాన్, భరత్, లక్ష్మణ్ పాల్గొన్నారు. గృహ యజమానులు బకాయిలు ఉండకుండా చూసుకోవాలని సూచించారు.

నసీరాబాద్ జాతీయ రహదారిపై
రోడ్డు ప్రమాదంలో గేదె మృతి



నసీరాబాద్ జాతీయ రహదారిపై కారు ఢీకొట్టడంతో మృతి చెందిన గేదె

నర్సాపూర్(జి), జనవరి 12 మండలంలోని నసీరాబాద్ గ్రామం వద్ద గురువారం రాత్రి ఎనిమిది గంటలకు రోడ్డు ప్రమాదం జరిగింది. స్థానికులు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రాత్రి ఎనిమిది గంటల సమయంలో నిర్మల్ నుంచి భైంసా వైపు వెళ్తున్న కారు టీఎస్16ఎఫ్‌డీ 3651 నంబరు గల కారు గేదెను ఢీకొట్టడంతో గేదె అక్కడికక్కడే చనిపోయింది. కారు ముందు భాగం నుజ్జు నుజ్జు అయ్యింది. నసీరాబాద్ గ్రామానికి చెందిన రైతు శ్యాందేవ్ గేదె మృతి చెందడంతో పోలీసుస్టేషన్‌లో ఫిరాదు చేశాడు.

విద్యార్థిని అదృశ్యం

సారంగాపూర్, జనవరి 12 : మండలంలోని గోపాల్‌పేట్ గ్రామానికి చెందిన బొండ్ల సింధూజ (23) అనే మహిళ అదృశ్యమైనట్లు ఎస్సై కృష్ణసాగర్ రెడ్డి తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బొండ్ల సింధూజ గురువారం నిర్మల్ పట్టణానికి వెళ్లి తిరిగి ఇంటికి రాకపోవడంతో గురువారం కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేసినట్లు పోలీసులు తెలిపారు. మహిళా ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

కుంటాలలో చోరీ

కుంటాల, జనవరి, 12: మండల కేంద్రం కుంటాలలో శుక్రవారం రాత్రి చోరీ జరిగింది. ఎస్ఐ హన్మండ్లు కథనం మేరకు గ్రామానికి చెందిన శ్రీనివాస్ తన ఇంటికి తాళం వేసి వాళ్ల అమ్మనాన్న ఇంటికి వెళ్లాడు. రాత్రి వేళలో కొందరు గుర్తుతెలియని వ్యక్తులు ఇంటి తాళం పగలగొట్టి బీరువాలో ఉన్న రూ. 10 వేల నగదు, అర్ధతులం బంగారం, 10 తులాల వెండి ఎత్తుకెళ్లారన్నారు. వీటి విలువ రూ. 40 వేల వరకు ఉంటుందని స్థానికులు తెలిపారన్నారు. ఘటన స్థలాన్ని ఎస్ఐ హన్మండ్లు పరిశీలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.